బీఎడ్ సప్లిమెంటరీకి దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 23: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఎడ్ విద్యార్థుల నుంచి స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. 2014కి ముందు చదివి ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఒక అవకాశం ఇవ్వాలనే ఉపకులపతి సుధీర్‌ప్రేమ్ కుమార్ ఆదేశాల మేరకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మే 6లోపు కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు.



స్మార్ట్ సిటీ అంటే ఇదేనా?

- మురుగు నీటితో కర్నూలు-కడప కాలువ
- విష ప్రవాహాలుగా మారిన తుంగభద్ర, హంద్రీ నదులు
- ప్రజా ఆరోగ్యంపై చిత్తశుద్ధి లేని వైసీపీ ఎమ్మెల్యేలు


కర్నూలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):



ఒక్క చాన్స్ ఇవ్వండి.. మేం ప్రభుత్వంలోకి రాగానే కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తా..! అని ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసినప్పుడు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. జనం ఆయన మాటలు నమ్మి ఓట్లు వేశారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఐదేళ్లు గడిచిపోయాయి. కర్నూలు నగరం మురికి కూపంగా మారిపోయింది. నగరం చుట్టూ, నగరం లోపల ఉండే నదులు విష ప్రవాహాలుగా మారాయి. డ్రైనేజీల సంస్కరణ మాటే లేదు. జనాలు రోగాలబారిన పడుతున్నారు. వెరసి స్మార్ట్ మాటేమో గాని జీవించడానికి సాధ్యం కాని రీతిలో నగరం దుర్గంధపూరితమైంది. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు ఏమయ్యాయో తెలియదు. పార్కుల ఆధునికీకరణకు ఖర్చు చేయడం తప్ప చేసిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాను చేసిన వాగ్దానాలపట్ల కనీస గౌరవం లేని, పట్టింపు లేని ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని నగర ప్రజలు అంటున్నారు. ఓట్లు వేయించుకొని గెలిచిన ఎమ్మెల్యేలకు అభివృద్ధి స్పృహే లేదని, మళ్లీ ఈ పార్టీకి ఎట్లా ఓట్లు వేయాలని జనం అంటున్నారు.

ఐదేళ్లపాటు ప్రభుత్వ నిర్లక్ష్యం, ఎమ్మెల్యేల బాధ్యతారాహిత్యం వల్ల కర్నూలు పట్టణం సమస్యల సుడిగుండంలో పడిపోయింది. ముఖ్యంగా ప్రాణ జలాలు పరవళ్లు తొక్కే కర్నూలు-కడప కాలువ (కేసీ కెనాల్) మురుగునీటి కాల్వగా మారింది. కాలువ పరిసరాల్లోని కాలనీల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన ఎమ్మెల్యేలు ప్రజలకు రోగాలు పంచుతున్నారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజకీయ అధిపత్యం కోసం పాకులాడడం తప్ప కేసీ కాల్వ శుద్ధి కోసం తీసుకున్న చర్యలు శూన్యం. నగరాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర.. నగరంలో ప్రవహించే హంద్రీ నదుల పరిస్థితి ఇదే.





ఓల్డ్ పంప్‌హౌస్ వద్ద తుంగభద్రలో కలుస్తున్న మురుగు నీరు

కర్నూలు-కడప కాలువ కర్నూలు నగరంలో మునగాలపాడు, మాసామసీదు, స్టాంటన్‌పురం, అశోక్‌నగర్, మమతానగర్, ధర్మపేట, నరసింహారెడ్డి నగర్, స్వామిరెడ్డినగర్, జోహరాపురం, ఇందిరా నగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 15 కిలో మీటర్లు ప్రవహిస్తుంది. కాలువ సామర్థ్యం 2,800 క్యూసెక్కులు. 1866లో ఆనాటి బ్రిటీష్ పాలకులు నిర్మించిన ఈ కేసీ కాలువ సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది. 1933 తరువాత పూర్తిగా సాగునీటి కాలువగా మార్చారు. జిల్లాకు చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో జపాన్ నిధులతో ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ కాల్వకు సాగునీరు అందించే తుంగభద్ర నదిపై నిర్మించి సంకేసుల బ్యారేజీ ఆధునికీకరణ పనులకు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో శ్రీకారం చుట్టారు. ఇంతటి ఘన చరిత్రగల కేసీ కాలువ పాలకుల నిర్లక్ష్యం వల్ల మురుగు కాల్వగా మారిపోయిందని సాగునీటి నిపుణులు, పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

నగరంలో ప్రవహించే కేసీ కాలువ కింద సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందుతోంది. మునగాలపాడు నుంచి జోహరాపురం వరకు 10-12 ప్రాంతాల్లో మురుగునీటిని కేసీలో వదిలేస్తున్నారు. ముఖ్యంగా అశోక్‌నగర్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మురుగునీరు కేసీలో కలుస్తున్నది. మురుగుతో పాటుగా ఆర్సినిక్, కోలాల్ట్, నికెల్, కార్బన్ మోనాక్సైడ్.. వంటి ప్రమాదకరమైన విష పదార్థాలు కూడా కలుస్తున్నట్లు గుర్తించారు. కాల్వలో మురుగు చేరకుండా కాపాడాల్సిన పాలకులు ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కుల్లో అభివృద్ధి పనులు చేస్తే 10-20 శాతం పర్సెంటేజీ వస్తుంది. అందువల్ల పాలకులు కేసీ కాల్వను మురుగునీటి కాల్వగా మార్చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తున్నాయి. ఇదేనా జగన్ మార్క్ స్మార్ట్ సిటీ అంటూ ప్రశ్నిస్తున్నారు.

గరళంగా మారిన తుంగభద్ర.. హంద్రీ

కేసీ కాలువ ఒక్కటే కాదు.. నగరంలోని విడుదలయ్యే ముగురునీరు కలవడంతో తుంగభద్ర, హంద్రీ నది, వక్కేరు వాగులు కూడా కలుషితంగా మారాయి. 14 ప్రాంతాల్లో నేరుగా మురుగు తుంగభద్రలో కలుస్తున్నది. అధికారిక లెక్కల ప్రకారమే రోజుకు 57 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) ముగురు తుంగభద్ర, హంద్రీ నదుల్లో కలుస్తోంది. నదుల్లో చేరే ముగురునీటిని శుద్ధి చేయాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం పలు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రాంబొట్ల దేవాలయం సమీపంలో రూ.79 కోట్లతో ఎస్‌టీపీ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఎస్‌టీపీ పనులు నిధులు లేక అది అటకెక్కింది.


భక్తిశ్రద్ధలతో భోగేశ్వరస్వామి రథోత్సవం



భోగేశ్వరస్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసిన అశేషంగా తరలి వచ్చిన భక్తులు

చిప్పగిరి, ఏప్రిల్ 23: చరిత్రాత్మక చిప్పగిరి గ్రామంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన భోగేశ్వర దేవాలయంలో స్వామివారి కల్యాణం, రథోత్సవం ముంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్తలు చెరువు తిమ్మప్ప, కొండా రామాంజనేయులు ఆధ్వర్యంలో రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అంతకుముందు వేద పండితులు వివిధ పూజలు చేశారు. రథాన్ని పూలతో అలంకరించి అందులో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఊరి వాకిలి దాకా ఊరేగించారు. కార్యక్రమంలో బూసినే విరుపాక్షి, ఎంపీపీ హేమలత, ఎంపీటీసీలు రజని, సుమలత, జూటూరు మారయ్య, మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

28న చంద్రబాబు రాక



కర్నూలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం, ప్రజాగళం యాత్రలో భాగంగా ఈ నెల 28న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి తదితరులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు, ఆలూరులో ప్రజాగళం పేరిట ప్రచారం నిర్వహించిన చంద్రబాబు రెండో విడత ప్రచారంలో భాగంగా 28న కర్నూలు, కోడుమూరు, మంత్రాలయంలో జరిగే ప్రచార సభల్లో పాల్గొనే అవకాశం ఉంది. 29న నంద్యాల పార్లమెంటు పరిధిలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అయితే 29వ తేదీ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

లోక్ అదాలత్ న్యాయాధికారిగా బీఎల్‌వీ శేషాద్రి



కర్నూలు(లీగల్), ఏప్రిల్ 23: జిల్లా లోక్ అదాలత్ న్యాయాధికారిగా బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంత వరకు గుంటూరు జిల్లా గురజాల ఉప న్యాయాధికారిగా పని చేస్తూ కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించాక జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సాయంత్రం పలువురు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, లోక్ అదాలత్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి వేసవి సెలవులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులను ప్రకటించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్ మంగళవారం తెలిపారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సెలవుల్లో సరదాగా అనే మెటీరియల్ వాట్సాప్ ద్వారా ఎస్‌సీఈఆర్‌టీని పంపించామని తెలిపారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వాటిని విద్యార్థులకు చేరవేసి వాట్సాప్ గ్రూపు ద్వారా పర్యవేక్షించాల్సిందిగా సూచించారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కన్నుల పండువగా హనుమాన్ శోభా యాత్ర





నగరంలో కొనసాగుతున్న శోభాయాత్ర

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 23: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ నగర శాఖల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వీర హనుమాన్ విజయ శోభాయాత్ర నిర్వహించారు. హనుమంతుడి భారీ విగ్రహ మూర్తిని వాహనంపై పెట్టి, అలంకరించి ఊరేగించారు. యువత కాషాయ వర్ణ పతాకాలు, టోపీలు ధరించి యాత్ర వెంట నడిచారు. చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున హనుమజ్జయంతిని పురస్కరించుకొని ఈ శోభాయాత్రను పాత నగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠం వద్ద వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి కాషాయ ప్రారంభించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి, జిల్లా కన్వీనర్ నీలి నరసింహ, వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేశ్ తదితరులు పాల్గొన్నారు.





కోలాటం ఆడుతున్న యువతులు

వంద దాటేశాయి..!

- 105కు చేరిన ఎంపీ, ఎమ్మెల్యేల నామినేషన్లు
- నామినేషన్ దాఖలు చేసిన టీజీ భరత్

కర్నూలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నామినేషన్లు భారీగా వస్తున్నాయి. మంగళవారం నాటికి సెంచరీ దాటి 105 నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం ఒక్క రోజే 27 నామినేషన్లు వచ్చాయి. కర్నూలు ఎంపీ స్థానానికి ముగ్గురు స్వతంత్రులు నామినేషన్లు వేశారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్, ఆయన సతీమణి టీజీ శిల్పా భరత్ నామినేషన్ల పత్రాలను ఆర్వో భార్గవ్‌తేజకు అందజేశారు. తల్లిదండ్రులు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి, సోదరుడు టీజీ రాఘవేంద్ర, కుమార్తె ఆరియాలతో కలిసి ఆర్వో కార్యాలయం చేరుకున్న టీజీ భరత్ నామినేషన్ దాఖలు చేశారు. మంచి రోజు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. అదేవిధంగా ఎమ్మిగనూరు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాశీంవలి, నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి రాఘవేంద్ర నామినేషన్లు వేశారు. ఆదోని నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ యాదవ్‌తోపాటు మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆలూరు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థి విరుపాక్షి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కిషోర్ నామినేషన్లు వేశారు. ఇప్పటి వరకు అత్యధికంగా కర్నూలు నుంచి 23, కోడుమూరు నుంచి 16, ఎమ్మిగనూరు నుంచి 15, పత్తికొండ నుంచి 12 నామినేషన్లు వచ్చాయి. కర్నూలు ఎంపీకి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లో సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయి. 24న బుధవారం మంచి రోజు కావడంతో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు వేసే అవకాశం ఉంది.



కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ పత్రాలు ఇస్తున్న టీజీ భరత్

5 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: సాధారణ ఎన్నికల సందర్భంగా మే 5 నుంచి 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ, హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. మంగళవారం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ తదితర అంశాలపై ఆర్వోలతో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారిగా పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఎంత మంది ఉన్నారనే వివరాలను బట్టి కౌంటర్లు ఏర్పాటు చేస్తే పకడ్బందీగా పెసిలిటేషన్ సెంటర్లు నిర్వహించవచ్చు అనే దాని మీద మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఒక్క వ్యక్తి ఫెసిలిటేషన్ సెంటర్‌లోకి వెళ్లి ఫారం సమర్పించి బ్యాలెట్ వేసి బయటకు వెళ్లేందుకు ఎంత సమయం పడుతుందనే దాని మీద మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. హోం ఓటింగ్‌పై నిర్వహించిన మాక్ డ్రిల్ లాగే ఫెసిలిటేషన్ సెంటర్‌లో కూడా మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు.



అబ్బ-ఛా!

సారుకు కారు లేదట..!

- ఆస్తులు మాత్రం రూ.13.77 కోట్లు
- నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వైసీపీ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి



ఆదోని, ఏప్రిల్ 23: ఆదోని వైసీపీ అభ్యర్థిగా సాయిప్రసాద్ రెడ్డి మంగళవారం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభ్యర్థులను పరిచయ కార్యక్రమంలో భాగంగా "ఆదోని సాయన్న గురించి నేను మీకు చెప్పాల్సిన పని లేదు... మీ అందరికీ పరిచయస్తుడు... కాకపోతే డబ్బులు విషయంలో మాత్రం అంతంత మాత్రమే... కాని మంచివాడు... సౌమ్యుడు..." అంటూ సెలవిచ్చారు. అయితే సాయన్న తనకు కారు కూడా లేదని నామినేషన్ పత్రాల్లో పేర్కొనడాన్ని చూసిన జనం జగన్ మాటల్ని అక్షర సత్యం చేశారని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. నామినేషన్ పత్రాలలో తన కుటుంబ స్థిర, చర ఆస్తుల వివరాలతోపాటు బంగారు ఆభరణాలు, భూముల వివరాలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. ఆయన ఆస్తులు రూ.13.77 కోట్లని, తనకు ఒక్క వాహనం కూడా లేదని పొందుపరిచారు. ఇంటి చుట్టూ పదుల సంఖ్యలో సొంత వాహనాలు ఉన్నా అఫిడవిట్‌లో మాత్రం ఒక్క వాహనం కూడా తన పేరున లేదంటూ చూపడం నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఉచితాలకు బానిసలు కావద్దు...

పెద్దల మాట..



ఆలూరు, ఏప్రిల్ 23: రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలకు, నోటుకు బానిసలు కాకూడదు. ఐదేళ్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అప్పట్లో వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని చూసి ఓటేసే వాళ్ళం... కానీ ఇప్పుడు పథకాలకు, ఓటుకు నోటుకు ఆకర్షితులవుతున్నారు. తమ భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భావితరాలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీల ఉచితాలను పక్కనపెట్టి ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పనపై దృష్టి సారించాలి. ఓటర్ ఆలోచించి తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే నాయకులు ఎన్నుకోవాలి.

- నరసన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

పూల బొకేలకు భలే గిరాకీ



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 23: ఎన్నికల సమయం కావడంతో పూలబొకేలకు గిరాకీ పెరిగింది. వైసీపీ నుంచి కొత్త అభ్యర్థి బుట్టా రేణుక మహిళ కావడంతో ఆమెను కలిసేందుకు వచ్చే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలహారాలతో కాకుండా పూలబొకేలతో పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. ఆమెకు పూలహారం వేసేందుకు అవకాశం లేకపోవడంతో పెద్ద ఎత్తున వచ్చేవారంతా పూల బొకేలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న పూలదుకాణాల్లో గిరాకీ పెరిగింది. గతంలో ఎప్పుడో ఎవరో వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే వీటిని కొనుగోలు చేసేవారు. అయితే బుట్టా రేణుక వైసీపీ నుంచి పోటీ చేస్తుండడంతో పూల బొకేలకు భారీగా గిరాకీ పెరిగిందని పూల దుకాణాదారులు పేర్కొంటున్నారు.



కార్పొరేటర్లు కాస్ట్‌లీ గురూ!

- జంపింగ్ జపాంగ్‌లతో వైసీపీలో గుబులు
- ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు..
- పక్క చూపులు చూడకుండా తాయిలాలు



కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: నియోజకవర్గంలో అధికార వైసీపీ తమ పార్టీ కార్పొరేటర్లకే డబ్బు పంచాల్సి వస్తోంది. కొందరు కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడంతో వారు టీడీపీ వైపు వెళ్తారేమోననే ఆందోళనతో అధికార పార్టీ తాయిలాలకు తెరతీసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు వారి బలాన్ని బట్టి రూ.లక్షలు ముట్టజెప్పినట్లు తెలిసింది. కర్నూలు అర్బన్ నియోజకవర్గంలో 33 వార్డులు ఉన్నాయి. ఇందులో 11 మంది కార్పొరేటర్లు టీడీపీకి చెందినవారు ఉండగా మిగిలిన 22 మంది వైసీపీ కార్పొరేటర్లే. అయితే టీడీపీ కార్పొరేటర్లు ఉండే చోట వైసీపీ నుంచి వార్డుకు ఇన్‌చార్జిలను నియమించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీజీ భరత్, వైసీపీ అభ్యర్థిగా ఎండీ ఇంతియాజ్ పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉండనుంది.

● ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షలు..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొందరు కార్పొరేటర్లు నిశబ్దంగా ఉండటం వైసీపీ అభ్యర్థికి గుబులు రేపుతోంది. దీంతో కొత్త ఓట్లు దేవుడెరుగు, ఉన్న ఓట్లు నిలుపుకుంటే చాలు అనుకునే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు తాయిలాలు పంచుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వైసీపీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో ప్రస్తుతం వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 22, టీడీపీ కార్పొరేటర్లు సంఖ్య 11 మంది చేరింది. అయితే వైసీపీలో గెలుపొందిన వారు అత్యధికంగా కొత్తగా పోటీ చేసిన వారే. నియోజకవర్గ పరిధిలో ఇంకా కొన్ని వర్గాలు ఎమ్మెల్యే అభ్యర్థికి దూరంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేటర్‌తోపాటు వార్డు ఇన్‌చార్జిలకు డబ్బుల గాలం వేసినట్లు సమాచారం. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది. నగరంలో 22 మంది కార్పొరేటర్లు, 11 మంది ఇన్‌చార్జిలకు లెక్కలు అందినట్లు సమాచారం.

● జంపింగ్ ఊహాగానాలతోనే..: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓ ప్రచారం ఊపందుకుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు పది మంది కార్పొరేటర్లు వెళ్తారనే ప్రచారం జరిగింది. దీంతో గోడ దూకే కార్పొరేటర్లపై వైసీపీ నేతలు ఆరా తీసినట్లు తెలిసింది. ఇప్పటికే 17,22 వార్డుల కార్పొరేటర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మరింత మంది జంప్ అయ్యే ప్రమాదముందని భావించిన వైసీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. అంతేగాకుండా మాజీ ఎమ్మెల్యే మాటలు వింటూ ప్రస్తుతం కార్పొరేటర్లను ఎమ్మెల్యే అభ్యర్థి దూరం పెడుతున్నారనే ప్రచారం కూడా కొనసాగుతోంది. అంతేగాకుండా శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని ఓ చోట 19 మంది కార్పొరేటర్లు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారని సోషల్ మీడియాలో హల్‌చల్ లేపింది. అందుకే ముడుపుల బేరం పెట్టినట్లు సమాచారం. అలా రూ.లక్షలు నింపుకున్న కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థి ప్రచారం పాల్గొంటారా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు.

లెక్కలు చూపకపోతే చిక్కులే..

ఆదోని, ఏప్రిల్ 23: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని పక్కాగా లెక్క చూపాల్సిందే... లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నుంచి చిక్కులు తప్పవు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్-19 ప్రకారం ఎన్నికల లెక్కలు చూపని అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి ఎన్నికల వ్యయాన్ని రూ.40 లక్షలుగా ఎన్నికల కమిషన్‌కు నిర్దేశించింది. ఆ మొత్తంలోనే అభ్యర్థుల వ్యయం చేయాల్సి ఉంటుంది. నామినేషన్ వేసినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు వ్యయాన్ని రశీదులతో సహా జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలి. రూ.40 లక్షల వ్యయం మించితే అందుకు సరైన ఆధారం చూపాలి. లెక్కల్లో ఏమాత్రం తేడా వచ్చినా, ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 సెక్షన్ 10(ఏ) ప్రకారం ఎన్నికైన అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని ఎన్నికల కమిషన్ రద్దు చేసే అవకాశం ఉంటుంది. అలాగే ఎన్నికైన అభ్యర్థులతోపాటు, ఓడిన అభ్యర్థులు కూడా తదుపరి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించే అవకాశం ఉంటుంది. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వర్స్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వ్యయ అంచనాను నమోదు చేస్తుంటారు.



అప్పుడే మొదలైన డబ్బు పంపిణీ

ఆదోని, ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే పోల్ మేనేజ్మెంట్‌పై కసరత్తు ప్రారంభించాయి. అభ్యర్థులు ఓటరు నాడి ఎటువైపో పసిగట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చివరి అస్త్రంగా డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. ప్రధాన రాజకీయ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసే స్థోమత ఉన్న అభ్యర్థులనే ఎన్నికల బరిలో నిలిపాయి. దీంతో ఏ పార్టీకి చెందని తటస్థులైన ఓటర్లు తమకు మూడు పార్టీల నుంచి డబ్బులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. గతంలో సాధారణంగా పోలింగ్ జరిగే ముందు రోజు రాత్రి ఆయా పార్టీల స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి ఓటర్ల సంఖ్యను లెక్కగట్టి డబ్బులు పంపిణీ చేసేవారు. అనేక కుటుంబాలు ఎలాగో డబ్బులు పంపిణీ చేస్తారనే ఆశతో రాత్రంతా నిద్రపోకుండా వేచి ఉండేవారు.



కాంగ్రెస్ వర్సెస్ టీడీపీ

- ఎమ్మిగనూరులో ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు ఇవే..
- రెండు సార్లు ఉప ఎన్నికలు
- ఈ సారి విజయం ఎవరిదో..!

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 23: ఎంతో సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 17వ సారి ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకు 14 సార్లు సాధారణ ఎన్నికలు జరగ్గా.. రెండు సార్లు ఉప ఎన్నికలు జరిగాయి. 1955లో ద్విసభ నియోజకవర్గంగా ఆవిర్భవించిన ఎమ్మిగనూరు నుంచి ముఖ్యమంత్రి స్థాయి నాయకులు పోటీ చేసి గెలిచారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ ఆరు సార్లు, టీడీపీ ఆరు సార్లు, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి, ఒకసారి కాంగ్రెస్(ఐ) అభ్యర్థి, రెండు సార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1955 ద్విసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్య తమ సమీప ప్రత్యర్థులు పీఎస్పీ అభ్యర్థి ఎస్ఎస్ రెడ్డి, సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్యలపై విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వైసీ వీరభద్రగౌడు కాంగ్రెస్ అభ్యర్థి కేవీ రెడ్డిపై విజయం సాధించారు. అలాగే 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పి. సత్యనారాయణరాజు స్వతంత్ర అభ్యర్థి వైసీ వీరభద్రగౌడుపై విజయం సాధించారు. 1972లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సత్యనారాయణరాజు ఎన్‌సీవో అభ్యర్థి ఎంవై సోమప్పపై విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా బరిలోకి దిగిన కేఆర్ హనుమంతరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రారెడ్డిపై గెలిచారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లో 1983లో కాంగ్రెస్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి హోదాలో ఎమ్మిగనూరు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థిగా నిలిచిన అబ్దుల్ రజాక్‌పై విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ గాలి వీచినా ఎమ్మిగనూరులో మాత్రం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి గెలవడం చరిత్రను తిరగరాసినట్లయింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడంతో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కేంద్ర ప్రభుత్వంలోకి వెళ్లారు. దీంతో 1984లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రియ శిష్యుడు బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నుంచి మొదటి సారి ఉప ఎన్నికలో పోటీ చేశారు. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేఆర్ హనుమంతరెడ్డిపై ఆరువేల పైచిలుకు ఓట్లతో విజయఢంకా మోగించారు. ఆ తర్వాత 1985లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దేవేంద్రగౌడు, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ శివన్న, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి ఎర్రకోట కేశవరెడ్డి, 1999లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి ఎర్రకోట కేశవరెడ్డిపైన విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో, 2009లో జరిగిన ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డిపైన కాంగ్రెస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆవిర్భవించిన వైసీపీలో చేరిన చెన్నకేశవరెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో 2012లో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బీవీ మోహన్‌రెడ్డి పోటీలో నిలవగా చెన్నకేశవరెడ్డి గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి విజయం సాధించి ఎమ్మిగనూరు నియోజకవర్గంపై మరోసారి టీడీపీ జెండాను ఎగురవేశారు. బీవీ వారసుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ఆయన మొదలు పెట్టారు. అనంతరం 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో చెన్నకేశవరెడ్డి గెలిచారు. తాజాగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాయి. మూడు దశాబ్దాలుగా బీవీ కుటుంబంతో తలపడిన ఎర్రకోట కుటుంబానికి టికెట్ దక్కలేదు. ఎమ్మిగనూరు ఎన్నికల చరిత్రలో తొలిసారి మహిళా అభ్యర్థి బుట్టా రేణుక బరిలోకి వచ్చారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైసీపీ నుంచి మాజీ ఎంపీ బుట్టా రేణుక రేసులో ఉన్నారు. ఈ సారి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి మరి.



ఇష్టారీతిన ఖర్చు పెడతామంటే కుదరదు



కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల ఇష్టారీతిన ఖర్చు పెట్టడానికి లేదు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీరి ఖర్చుల వివరాలను తెలుసుకోవడానికి ఇప్పటికే జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు దృష్టి సారించారు. అభ్యర్థుల ప్రచారం, సభలు, ర్యాలీలు తదతర కార్యక్రమాల ఖర్చును ఎప్పటికప్పుడు లెక్కిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి ఖర్చు చేస్తే పడే అవకాశం ఉంది. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ధరలు ఇలా ఉన్నాయి. అభ్యర్థులు ఉపయోగించే వాహనాన్ని బట్టి ఒక రోజు అద్దె రూ.1000 నుంచి రూ.1800 వరకు ఉంది. డ్రైవర్ బత్తా రోజుకు రూ.500 ఇవ్వాలి. ఆహార పదార్థాలకు సంబంధించి మజ్జిగ రూ.10, జ్యూస్ రూ.50, కోకోనట్ వాటర్ రూ.50, వాటర్ బాటిల్స్ రూ.20, ఇడ్లీ రూ.30, చికెన్ ధమ్ బిర్యాని రూ.170, చికెన్ కర్రి రూ.120, ఫుల్ మీల్స్ రూ.120, మటన్ కర్రి రూ.300, వుడ్‌కు చెందిన కటౌట్స్, స్క్వేర్ ఫీట్‌కు రూ.80, క్లాత్ అండ్ ప్లాస్టిక్ చెందిన కటౌట్స్ స్క్వేర్ ఫీట్‌కు రూ.40, బ్యానర్స్ విషయంలో స్క్వేర్ ఫీట్‌కు రూ.30, ప్లాస్టిక్ బ్యానర్స్ స్క్వేర్ ఫీట్‌కు రూ.15లు, టేబుల్‌కు రూ.50, బారికేడ్లు, స్క్వేర్ ఫీట్‌కు రూ.20, క్లాత్ ఫ్లాగ్ 6/3 (180), పార్టీ గుర్తుతో ఉన్న టోపీలు ఒకటి రూ.50, టీషర్ట్స్ ఒకటి రూ.120, ప్లాస్టిక్ ఫ్లాగ్ 10/4 సైజు రూ.800, 6/3 సైజు రూ.500, 4/3 సైజు రూ.350, 3/2సైజు రూ.200, పాంప్లెట్స్ ఏ4సైజ్ పేపర్ 1000కి రూ.2వేలు ఏ4 టూ సైజ్ పేపర్ 1000కి రూ.వెయ్యి, కల్చరల్ ప్రోగ్రామ్ గ్రూప్స్ ఒక్కరికి రూ.1000, జనరేటర్ ఒక రోజుకు అద్దె రూ.1000, ప్లాస్టిక్ కుర్చీ రూ.6లు, హ్యాండ్ కుర్చీ రూ.10, మహారాజా కుర్చీలు రూ.1,200, షామీయానా 18/36 సైజు రూ.1,500, 12/24 సైజు రూ.1,000, 9/18 సైజు రూ.600, డ్రమ్స్, మ్యూజికల్స్ హెడ్‌కి రూ.1000, గ్రీన్‌కార్పెట్స్ 6/30 సైజు ఒక రోజుకు రూ.200, ఆపరేటర్, స్పీకర్ వాహనంతో కలిపి రూ.6,500 డీవీడి ఒక రోజుకు రూ.2,500 ట్రాఫిక్ సిగ్నల్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఒక స్క్వేర్ మీటర్‌కు రూ.2,100, సీసీ కెమెరా పోల్ బోర్డ్స్ రూ.2,100, సినిమా హాల్స్‌లో అడ్వర్టైజ్మెంట్ కలర్ వన్ సైడ్ ఫర్ మంత్ రూ.1,950, ట్రైలర్స్ 150మీటర్ల వరకు ఒక నెలకు రూ.6,000, 150 నుంచి 300 మీటర్ల వరకు ఒక నెలకు రూ.13,500, హోటల్ సింగిల్ రూమ్ ధర రూ.500, డబుల్ రూమ్ రూ.1,500 ఎన్నికల సంఘం నిర్ణయించింది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యే మసాల ఈరన్న



ఆలూరు, ఏప్రిల్ 23: ఆలూరు నియోజకవర్గంలో మసాలా ఈరన్న అంటే బ్రాండ్... మాస్ లీడర్‌గా పేరు సంపాదించుకున్నారు. ఆయన పెద్దగా చదువుకోకపోయినా ఆలూరు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. ఆలూరు నియోజకవర్గం 1955లో ఏర్పడింది. రెండు పర్యాయాలు ఓసీ జనరల్‌గా ఉంది. 1960లో ఎస్సీ జనరల్‌గా మారింది. 1978లో ఇండియన్ కాంగ్రెస్ నుంచి 1985లో కాంగ్రెస్ పార్టీ నుంచి 1994లో టీడీపీ నుంచి పోటీ చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1987 నుంచి 1992 వరకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా సేవలు అందించారు.

ఆ నాలుగు పార్టీలదే హవా

ఆదోని టౌన్, ఏప్రిల్ 23: ఆదోని అసెంబ్లీ స్థానానికి 1955 నుంచి ఇంత వరకు 14 సార్లు ఎన్నికలు జరిగితే, వివిధ రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ పడుతూ వచ్చారు. కానీ అందులో నాలుగు పార్టీల అభ్యర్థులు మాత్రం విజయం సాధిస్తూ తమ హవాను కొనసాగిస్తూ వస్తున్నారు.

● పోటీలో ఇంత వరకూ పాల్గొన్న పార్టీలు...

1955 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీఎస్పీ (ప్రజా సోషలిస్టు పార్టీ), వీపీ పార్టీ, ఎస్‌డబ్ల్యూఏ (స్వతంత్ర పార్టీ), తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, జనసేన, బీజేపీ, సీపీఎం, టీడీపీ ఎన్‌టీఆర్ (యల్‌పీ), బీఎస్పీ, ఆమ్ ఆద్మీ పార్టీ, జనతా పార్టీ, ఎంఐఎం, పీడీఓఐ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ పడుతూ వచ్చారు.

● రెండు సార్లు ఇండిపెండెంట్ అభ్యర్థులు..

14 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 15 వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీలో పాల్గొన్నా పీఎస్పీ, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు మాత్రమే గెలుస్తూ వచ్చారు. పీఎస్పీ తరపున ఒకసారి, కాంగ్రెస్ తరపున ఆరు సార్లు, టీడీపీ తరపున మూడుసార్లు, వైసీపీ తరపున రెండు సార్లు అభ్యర్థులు విజయం సాధిస్తూ వచ్చారు. రెండు సార్లు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా గెలవడం విశేషం.

పోలింగ్ ఏజెంట్లే కీలకం...



ఆదోని, ఏప్రిల్ 23: పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్రే కీలకం. బోగస్ ఓట్లు పడకుండా ఓటేయడానికి వచ్చే వారిని వీరు నిశితంగా పరిశీలిస్తారు. గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థు ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు కూర్చుంటారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రతి అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. ఏజెంట్లు ఓటరుగా నమోదై ఉండటంతోపాటు ఫొటో గుర్తింపు కార్డు ఉండాలి. కేంద్రంలో జరిగే ప్రతి కదలిక, తతంగాన్ని ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా, ప్రిసైడింగ్ అధికారి, పరిశీలకులు, సూక్ష్మ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు.

సార్వత్రిక ఎన్నికల పరిశీలకుల నియామకం

కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కర్నూలు జిల్లాకు ఎన్నికల పరిశీలకులు నియమించబడ్డారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన తెలిపారు. జాఫర్ ఐఏఎస్, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా ఉంటారని చెప్పారు.. మీర్ తారిఖ్ ఆలి ఐఏఎస్ ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా, ఉమేష్ కుమార్ ఐపీఎస్ కర్నూలు పార్లమెంటు పరిధిలోని కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని ఆలూరు నియోజకవర్గాలకు పోలీసు పరిశీలకులుగా నియమితులయ్యారని తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఆర్ఆర్ఎం శుక్లా ఐఆర్ఎస్, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గానికి, అరిందమ్ ముఖోపాధ్యాయ్ ఐఆర్ఎస్, కర్నూలు, పాణ్యం పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు రాకేష్ భదాదియా ఐఆర్ఎస్ ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, నియోజకవర్గాలకు నియమితులయ్యారు.

- వీసీ జాఫర్ ఐఏఎస్ - 6300932374
- మీర్ తారీఖ్ ఆలి, ఐఏఎస్ - 6300924829
- ఉమేష్ కుమార్ ఐపీఎస్ - 9014300783
- ఆర్ఆర్ఎం శుక్లా ఐఆర్ఎస్ - 6300318487
- అరిందమ్ ముఖోపాధ్యాయ్ ఐఆర్ఎస్ - 6300322616
- రాకేష్ భదాదియా ఐఆర్ఎస్ - 6300316818

టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలి


కళాకారులతో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 23: తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కళాకారులు కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల కోసం పాటలు, ప్రదర్శనల ద్వారా టీడీపీ ప్రభుత్వం అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సందర్భంగా హనుమంతరావుచౌదరి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గమైన పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి పద్మాచౌదరి, కళాకారులు పాల్గొన్నారు.

కోన వేంకటేశ్వర స్వామికి పూజలు


రథం ముందు హోమం చేస్తున్న పురోహితులు

సి.బెళగల్, ఏప్రిల్ 23: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన కోన వేంకటేశ్వరస్వామికి మంగళవారం పురోహితులు నరసింహయ్య రథం ముందు హోమం చేయించి స్వామివారికి పూజలు చేశారు. ఈసందర్భంగా పురో హితులు నరసింహయ్య మాట్లాడుతూ బుధవారం రథోత్సవం నిర్వహి స్తున్నామన్నారు.

క్రిష్ణదొడ్డిలో తాగునీటి ఎద్దడి

సి.బెళగల్, ఏప్రిల్ 23: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవిలో గ్రామంలో ఉన్న బోర్లు, వ్యవసాయ బొరుబావులు ఎండి పోయాయి. ఈవిషయాన్ని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు హక్కు విలువ తెలుసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువ తెలుసుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ అన్నారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. 214 నుంచి 220 పోలింగ్ స్టేషన్ల వరకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బ్రాహ్మణుల అభివృద్ధి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: రాష్ట్రంలో బ్రాహ్మణుల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఒక్క పైసా నిధులు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు నాయుడు బ్రాహ్మణుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ స్థాపించి నిధులు కేటాయించారని గుర్తు చేశారు. జగన్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి పాలకవర్గాన్ని నియమించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులంతా ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

సి.బెళగల్, ఏప్రిల్ 23: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో వెలసిన పడమర ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మద్దయ్యస్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేడు బొగ్గుల దస్తగిరి నామినేషన్

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 23: కోడుమూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ తరఫున బుధవారం బొగ్గుల దస్తగిరి నామినేషన్ వేయనున్నారు. కర్నూలు నెహ్రూనగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటి నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి కర్నూలు రూరల్, అర్బన్, కోడుమూరు, సి .బెళగల్, గూడూరు మండలాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విష్ణుసేన అభిమానులు తరలి రావాలని బొగ్గుల దస్తగిరి కోరారు.

వీడియోల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 23: రాష్ట్ర విభజన తర్వాత, జిల్లాల పునర్విభజన తర్వాత కర్నూలు అభివృద్ధిలో చివరగా ఉందని, జిల్లా ప్రజల ఆశలు తెలుసుకునే ప్రయత్నంగా తమ సంస్థ కర్నూలు అభివృద్ధిపై వీడియోల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు కర్నూలు డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్ మోహన్ కడింపల్లి తెలిపారు. మంగళవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రజలు ఏమి కోరుకుంటున్నారు..? ప్రాజెక్టులా, పరిశ్రమలా, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీయా, రియల్ ఎస్టేట్, మెడికల్ హబ్, టూరిజం, స్పోర్ట్స్ హబ్ తదితర అంశాలపై తెలుసుకునేందుకు ఈ కార్యక్ర మం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రాన్ని కాపాడుకుందాం


టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 23: అందరం కలిసి రాష్ట్రాన్ని కాపాడుకుందామని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మౌర్యఇన్‌లోని తన కార్యాలయంలో ధర్మపేట ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు తిమ్మప్ప ఆధ్వర్యంలో మహిళలు, యువకులు భారీగా తరలి వచ్చి మద్దతు తెలిపారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ వైసీపీ పాలన మళ్లీ రాష్ట్రానికి వద్దన్నారు. పొరపాటున ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తే ఘోరమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్డీయే కూటమీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. తమ ప్రభుత్వం అర్హులదరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ అర్షద్, టీడీపీ నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ఉసురు తగులుతుంది: వైసీపీ ప్రభుత్వానికి పింఛన్‌దారుల ఉసురు తగులుతుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని 9వ వార్డు తెలుగుగేరి ప్రాంత్రంలో టీజీ భరత్ భరోసా యాత్ర చేపట్టారు. ఈసందర్భంగా మహిళలు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వైర్లు, పింఛన్ తదితర సమస్యలు టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు శేషగిరి శెట్టి, శ్రీనివాసులు, పూల రంగడు, సత్యనారాయణ, కుమారస్వామి, రమణ, కుమార్, షేరాజ్ అలీఖాన్, రహ్మత్ బాషా, జితేందర్ పాల్గొన్నారు.

● టీడీపీలో చేరిన ధర్మపేట మహిళలతో టీజీ భరత్


భరోసా యాత్రలో మాట్లాడుతున్న టీజీ భరత్

టీడీపీలో చేరిన 100 కుటుంబాలు

కల్లూరు, ఏప్రిల్ 23: ఓర్వకల్లు మండలంలో అధికార పార్టీకి దెబ్బమీద దెబ్బ తగులుతోంది. మండలానికి చెందిన శకునాల, పూడిచెర్ల, హుసేనాపురం గ్రామాల్లో వైసీపీకి చెందిన కుటుంబాలు భారీగా తెలుగుదేశం పార్టీలో చేరాయి. మంగళవారం మాధవీనగర్‌లోని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి స్వగృహంలో వారు టీడీపీలో చేరారు. శకునాల నుండి 60 బీసీ కుటుంబాలు, పూడిచెర్ల నుండి 20 ముస్లిం కుటుంబాలు, హుసేనాపురం నుండి 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో పాలకొలను సుధాకర్‌రెడ్డి, నన్నూరు విశ్వేశ్వరరెడ్డి, మహబూబ్‌బాషా, రాజన్న, మురళీరెడ్డి, తిప్పాయిపల్లె సుధాకర్‌రెడ్డి, హుస్సేనాపురం సర్పంచ్ పెద్దస్వామి, కెవి. మధు, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

● 29వ వార్డులో: కల్లూరు అర్బన్ 29వ వార్డు సవారీతోటకు చెందిన 50 కుటుంబాలు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. ఖాశీం, ఇమామ్‌హుసేన్, లాలుబాషా, సురేష్, మధు, బషీర్, దస్తగిరమ్మ, హుస్సేన్‌బీ, లక్ష్మి, రవణమ్మ, శేషమ్మ, మద్దయ్య తదితరులు వైసీపీని వీడారు.


గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కర్నూలు అసెంబ్లీకి ఆరు నామినేషన్లు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ భరత్ నామినేషన్

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఆరో రోజు ఆరు నామినేషన్లు వచ్చాయి. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ తేజ తన చాంబర్‌లో నామినేషన్లు స్వీకరించారు. ఇప్పటి వరకు కర్నూలు అసెంబ్లీకి 23 నామినేషన్లు వచ్చాయి. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీజీ భరత్ రెండు సెట్లు నామినేషన్ వేయగా, ఆయన సతీమణి టీజీ శిల్ప ఒక సెట్ ఆర్వోకు అందజేశారు. టీజీ భరత్ కుటుంబసభ్యులంతా నామినేషన్ వేసేందుకు కార్యాలయానికి వచ్చారు. గౌతమ్‌క్రిష్ణ యాదవ్(సమాజ్‌వాదీ పార్టీ), షేక్ మాలిక్ బాషా (కాంగ్రెస్, అరుణ్‌కుమార్(బహుజన సమాజ్‌పార్టీ) అభ్యర్థులు ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేశారు. టీజీ భరత్ వెంట మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, సతీమణి రాజ్యలక్ష్మి, కూతురు అరియా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీసీ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు ఉన్నారు.


టీజీ భరత్ నామినేషన్ పత్రాలు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి ఎ. భార్గవతేజ

అభివృద్ధి నిరోధకుడు జగన్ : దస్తగిరి


ముడుమాలలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 23: అభివృద్ధి నిరోధకుడు జగన్ అని టీడీపీ కోడు మూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. మంగళవారం మండలం లోని ముడుమాల గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో అధికారం చేపట్టిన జగన్ నవర త్నాల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటిం టికీ తిరిగి బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, రేపల్లె పౌలు, ఈర్లదిన్నె శేషన్న, ఎంపీటీసీ ఈరన్నగౌడు, మల్లికార్జునగౌడు, జడ్పీటీసీ గిరిజోన్, రాంబాబు, లక్ష్మన్న మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, బాలాజీ వెంకటేశ్, శీనప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా


ఎస్ఐ తిమ్మారెడ్డితో మాట్లాడుతున్న ఎస్పీ

సి.బెళగల్, ఏప్రిల్ 23: మండలంలోని గొల్లలదొడ్డి, పోలకల్లు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ శ్రీకృష్ణకాంత్ అకస్మింగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డితో మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గొల్లలదొడ్డి పోలింగ్ కేంద్రంలో కంపౌండ్ వాల్ లేదని, ఇతర మౌలిక వసుతులు సక్రమంగా లేవని, వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ఓటర్లను రాజకీయ నాయకులు ప్రలోభాలకు గురి కాకుండా చూడాలన్నారు. మండలంలోని రౌడీ షీటర్ల దిన చర్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

అమీలియోలో శస్త్ర చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 23: బళ్లారి చౌరస్తా సమీపంలోని అమీలియో హాస్పిటల్‌లో ఓ మహిళ కడుపులో ఉన్న 6 కేజీల కణితిని తొలగించి వైద్యులు ఆమె ప్రాణాన్ని కాపాడారు. నగరంలోని జంపాల శివయ్యనగర్‌కు చెందిన 62 ఏళ్ల పార్వతమ్మ కడుపు నొప్పితో బాధపడుతూ మార్చి 27న అమీలియో హాస్పిటల్‌కు వచ్చింది. గైనకాలజిస్టు డా.కె. కావ్య మహిళకు పరీక్షలు నిర్వహించగా.. కడుపులోని అండాశయం ఓవరీలో 6 కేజీల కణితి ఉన్నట్లు గుర్తించింది. దీంతో ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ చేయించుకుని గైనకాలజిస్టులు డా.కావ్య, డా.శృతి అనస్థీషియా వైద్యు రాలు టి.శిల్ప వైద్యబృందం కడుపులో 6 కేజీల కణితిని తొలగించారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ప్రశంసాపత్రాలు

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 23: సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల్లో పని చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్లకు ఆ సంస్థ కోఆర్డినేటర్ ఇంజేటి శ్రీదేవి ప్రశంసాపత్రాలు అందజేశారు. మంగళవారం స్థానిక సీ.క్యాంపు సెంటర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెల్త్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసిన 14 మంది హెల్త్ సూపర్‌వైజర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

శ్రీలక్ష్మీ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 23: పదో తరగతి ఫలితాల్లో శ్రీలక్ష్మీ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మంది విద్యార్థులు 500 మార్కు లకు పైగా సాధించారు. సయద్ ఫైజాసారా 594, ఎం.లాస్యశ్రీ 592, ఫాతిమా 589, చంద్రిక 585, వైభవ్ 584, లిఖిత్ 581, రహితా ఆదీన్ 576 మార్కులు సాధిం చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించింది.

నేడు గౌరు చరిత నామినేషన్


చంద్రబాబు నుంచి బీఫాం అందుకుంటున్న గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 23: పాణ్యం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా గౌరు చరిత బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు అర్బన్, రూరల్, గడివేముల, పాణ్యం మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు 10 గంటలకు నంద్యాల చెక్‌పోస్టులోని మోగాసిరి ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఉదయం 11.30 గంటలకు మోగా సిరి ఫంక్షన్‌హాల్ నుంచి గౌరు వెంకటరెడ్డి, గౌరుచరిత దంపతుల ఆధ్వర్యంలో కార్యకర్తలతో భారీ ర్యాలీతో ఊరేగింపుగా కలెక్టరేట్‌కు చేరుకోనున్నారు. పాణ్యం టీడీపీ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను కర్నూలు జేసీ చాంబర్‌లో ఆర్వో నారపురెడ్డి మౌర్యకు అందజేయనున్నారు.

941 మంది వలంటీర్లు రాజీనామా

కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: జిల్లాలో ఈనెల 19వ తేదీ వరకు 693 మంది, 22వ తేదీ వరకు 248 మంది గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు తమ వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేయగా.. సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజీనామాలను ఆమోదించినట్లుగా కలెక్టర్ జి.సృజన తెలిపారు.

హౌస్ సర్జన్లపై ప్రత్యేక పర్యవేక్షణ

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 23: అన్ని విభాగాల్లో ఉండే హౌస్ సర్జన్‌లపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిం టెండెంట్ వి. వెంకట రంగారెడ్డి హెచ్‌వోడీలను ఆదేశించారు. మంగళవారం ధన్వం తరీ హాలులో ఆయన హెచ్‌వోడీలతో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని ఏఎంసీ, చిన్న పిల్లల విభాగంలోని ఎస్ఐసీయు వార్డులో ఏసీలు అందుబాటులోకి వచ్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో వెంకటరమణ, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 23: మండలంలోని బైనదొడ్డిలో సుంకులమ్మ దేవర ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయా నికి చేరుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర సారె, పూలు, గాజులు, టెంకాయ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఇస్మాయిల్

ఓర్వకల్లు, ఏప్రిల్ 23: మండలంలోని గుట్టపాడు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.ఇస్మాయిల్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాశ్ రెడ్డి, నరేంద్ర నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కౌన్సిల్ సమావేశంలో ఇస్మాయిల్‌ను ఆరోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, ఈయనతో పాటు హుశేనాపురం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శేషాచలం జిల్లా ఉపాధ్యక్షుడి గా, మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఎస్.రాఘవరెడ్డ, సురేష్, పెద్దస్వామి, రామలింగేశ్వరరెడ్డిలను రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎన్నుకున్నారని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోండి


పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్ఓ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ తెలిపారు. మంగళవారం ఏ.క్యాంపు ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు కోసం ఈ నెల 26 వరకు గడువు ఉందన్నారు. మే 5,6,7,8 తేదీల్లో ఇందిరాగాంధీ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈ రవిప్రకాష్‌నాయుడు, సూపరింటెండెంట్ మన్సూర్ బాషా పాల్గొన్నారు.

వైభవంగా సుంకులాపరమేశ్వరి రథోత్సవం


కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గూడూరు, ఏప్రిల్ 23: కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారి రథోత్సవం అశేష భక్త జనుల మధ్య వైభవంగా జరిగింది. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.వి. నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు ఉమ్మడి జిల్లా నుండే కాక ఇతర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు.

●అమ్మవారిని దర్శించుకోవడానికి సినీ నటీ లత, ఆలయ నిర్మాణ దాత రాజ్‌కుమార్ కె.నాగులాపురం వచ్చారు. వారు సుంకులాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు చేసారు.

ఓల్డ్ టౌన్ సెక్షన్‌లో నేడు విద్యుత్ కోత

కల్లూరు, ఏప్రిల్ 23: విద్యుత్‌లైన్ల మరమ్మతులో భాగంగా ఓల్డ్‌టౌన్ పరిధిలో విద్యుత్‌కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్ ఈఈ వెంకటేశ్వర్లు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఓల్డ్‌టౌన్ సెక్షన్‌లోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియా, కుమ్మరిగేరి, రాంబొట్ల, చిత్తారి వీధి, వన్‌టౌన్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు.

క్యాజువాల్టీకి కొత్తగా మొబైల్ అల్ట్రాసౌండ్ మిషన్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 23: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాల్టీ ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్టుమెంటుకు కొత్తగా రూ.12 లక్షల విలువ చేసే మొబైల్ అల్ట్రాసౌండ్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. కొత్తగా వచ్చిన మొబైల్ అల్ట్రాసౌండ్ మిషన్, మొబైల్ ఎక్స్‌రే మిషన్ సేవలను తక్షణమే క్యాజువాల్టీలో ప్రారంభించాలని ఆసుపత్రి సూపరిటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ డా.డీవీ రామశివ నాయక్‌ను ఆదేశించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ రామశివనాయక్, ప్రొఫెసర్ వై.శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లివర్ జబ్బులకు అత్యాధునిక చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 23: లివర్, ప్యాంక్రియాటిక్, పిత్తాశయ నాళానికి అత్యాధునిక పద్ధతుల్లో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని అమెరికా గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ నళిని మోహన్ అన్నారు. మంశవారం ఆయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని కేఎంసీ పూర్వ విద్యార్థిగా సందర్శించారు. అనంతరం గ్యాస్ట్రోఎంట్రాలజీ సెమినార్ హాల్‌లో లివర్, ప్యాంక్రియాటిక్ జబ్బులపై జరిగిన వైద్య విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అమెరికా దేశంలో అందుతున్న గ్యాస్ట్రో ఎంట్రాలజి వైద్యవిధానాలు, చికిత్సలు 70 శాతం ఇక్కడ కూడా లభిస్తున్నాయన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజి అసోసియేట్ ప్రొఫెసర్ జి.మోహన్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపక్, ఆర్షియా, వైస్ ప్రెసిడెంట్ హరిచరణ్, ఎండో క్రైనాలజీ పి.శ్రీనివాసులు, మెడిసిన్ ప్రొఫెసర్ లక్ష్మీబాయి ఆయన్ను సన్మానించారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

బడుగుల అభ్యున్నతి బాబుతోనే సాధ్యం

● టికెట్ల పంపిణీలో బీసీలకు సముచిత స్థానం
● మండలాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్

ఆస్పరి, ఏప్రిల్ 23: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని టీడీపీ ఆలూరు నియోజకవర్గ అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని తంగరడోణ, కల్లపరి, యాటకల్లు, చిరుమాన్‌దొడ్డి, హాలిగేర, నగరూరు, చిగిలి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ పథకాల గూర్చి వివరించారు. తమ ఓటును టీడీపీకే ఎందుకు వేయాలో వారికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో 20 రోజుల్లో ఒక్క చాన్స్ అంటూ వచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన సైకో జగన్ రెడ్డి శని తొలగిపోతుందని అన్నారు. గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కూటమి లక్ష్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పరమరెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, ఎస్ తిమ్మన్న, సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు శేషిరెడ్డి, పీ కిష్టప్ప, సుదర్శన్ యాదవ్, ఈరన్న ఆచారి, రామకృష్ణ, నాగరాజ్ యాదవ్, ధర్మ, ఓబులేషు, చిన్న రంగన్న పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాల గూర్చి ప్రజలకు వివరిస్తున్న వీరభద్రగౌడ్



హాళగుందలో వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వీరభద్రగౌడ్

టీడీపీలోకి 25 కుటుంబాలు

హాళగుంద : వైసీపీ నుంచి 25 కుటుంబాలు వీరభద్రగౌడ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. స్థానిక కోట వీధిలోని ఆయన నివాసంలో చిన్నహ్యాట వెంకటేష్, హిరెట్టిన రాజశేఖర్, రఘుపతి మారేష్, ఉత్తరేషి, మారకట్టు రమేష్, కేసీ రాము టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిప్పయ్య, కోనేరు సాయిబేష్, బోయ మల్లి, పీరా, బాగోడి రాము, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

● ఉపాధి కార్యాలయం ముందు బైఠాయించిన కూలీలు

హొళగుంద, ఏప్రిల్ 23: ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం ఆమెపై చర్యలు తీసుకోవాలని హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు మంగళవారం డిమాండ్ చేశారు. ఉపాధి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పనులకు హాజరుకాని వారికి ఆరు రోజులకు రూ.1,300 కూలి వస్తుందని, ఎండలో కష్టపడి పని చేసిన మాకు ఆరు రోజులకు గానూ రూ.500లు కూలీ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ విశాలాక్షి ఐదేళ్లుగా పని ప్రదేశానికి రావడం లేదని, ఆమె భర్త గాదిలింగ వారం రోజులకు ఒకసారి వస్తున్నారని అన్నారు. అలాగే తమ ఇంటి వారికే ఉపాధి మస్టరులో హాజరు వేసుకొని కూలీ డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సదరు ఫీల్డ్ అసిస్టెంట్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో ఆజాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

నేటి నుండి వేసవి సెలవులు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 23: నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. మంగళవారం చివరి రోజు కావడంతో విద్యార్థులు పాఠశాలల నుంచి ఉత్సాహంగా ఇంటి బాట పట్టారు. స్నేహితులతో చాలాసేపు గడిపి ఒకరికి ఒకరు వీడ్కోలు పలికారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

చీని చెట్లు దగ్ధం

గోనెగండ్ల, ఏప్రిల్ 23: బైలుప్పల గ్రామంలో మాధవరెడ్డి కి చెందిన 30 చీని చెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు మాధవరెడ్డి వివరాల మేరకు.. తనకు ఉన్న 2.50 ఎకరాలలో చీని తోట సాగు చేశాడు. తోట ప్రధాన రహదారికి దగ్గరగా ఉంది. రోడ్డుకు దగ్గర ఉండటంతో రోడ్డు పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి ఆ నిప్పును పారవేశారు. ఎండవేడిమికి నిప్పు రగులుకొని చీని తోటకు నిప్పు తగులుకుంది. దీంతో 30 చీని చెట్లు కాలి పోయాయి. దీన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అయితే మంటలు అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం ఉద్యానవన శాఖ వారు వచ్చి నష్టాన్ని అంచనా వేశారు. దాదాపు రూ. 4లక్షల ఆస్తినష్టం జరిగిందని తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

మద్దికెర, ఏప్రిల్ 23: ఎం.అగ్రహారం గ్రామంలో ఫక్కీరప్పస్వామి రథోత్సవం సందర్భంగా నేడు 24న ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి దేశం కిలారి రాతిదూలం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు మొదటి నుంచి 5 బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9701090928 నెంబరునుసంప్రదించాలని సూచించారు.

టీడీపీ గెలుపు కోసం పోరాడుతాం

● పార్టీ ఫండ్ రూ.50వేలు అందజేత

తుగ్గలి, ఏప్రిల్ 23: టీడీపీ విజయం కోసం లింగాయత్‌లంతా కృషి చేస్తామని వీరశైవ లింగాయత్ కర్నూలు జిల్లా కమిటి సభ్యులు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. మంళవారం విజయనగరం జిల్లా శృంగవరం కోటలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి తన సొంత డబ్బులు రూ.50వేలను పార్టీ ఫండ్‌కు చెక్కును అందజేశారు. అలాగే రాష్ట్రంలో లింగాయతుల మద్దతు టీడీపీకే ఉంటుందని తెలిపారు. అనంతరం కౌశిక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వీరశైవ లింగాయతులు 18 లక్షల మంది ఉన్నారని, కర్నూలు 1.80లక్ష మంది ఉన్నారని. తమందరి మద్దతు టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పోరాడుతామని పేర్కొన్నారు.



చంద్రబాబును కలిసిన జిల్లా వీరశైవ లింగాయత్ కమిటీ సభ్యులు కౌశిక్ కుమార్

ఇప్పుడు గుర్తుకొచ్చామా...?

● గుక్కెడు నీరివ్వండని వేడుకున్నాం.. పట్టించుకున్నారా..?
● ఎమ్మెల్యే శ్రీదేవిని నిలదీసిన జొన్నగిరి వాసులు



జొన్నగిరిలో ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళలు

తుగ్గలి, ఏప్రిల్ 23: కొన్నేళ్ల నుంచి తాగునీరు లేక అల్లాడుతున్నాం.. గుక్కెడు నీరిప్పించండని వేడుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ఓట్ల కోసం ఎందుకొచ్చారు అంటూ మహిళలు పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవిని నిలదీసిన సంఘటన మంగళవారం జొన్నగిరి గ్రామంలో చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపట్టారు. అదే సమయంలో మెయిన్‌బజారులో తాగునీటి ట్యాంకర్ల కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే ప్రచారం చేస్తూ వెళ్తుండగా మహిళలు తాగునీటి సమస్యపై తీవ్రంగా స్పందించారు. గుక్కెడు నీరివ్వండని సంవత్సరాలుగా అడుగుతున్నా పట్టించుకున్నారా..? ఇప్పుడు ఓట్ల కోసం ఎందుకొచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మహిళల ఆవేశాన్ని పసిగట్టి కనీసం వారి వైపు కన్నెత్తి చూడకుండా ముఖంచాటేశారు. స్థానిక నాయకులు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని మాటలు చెప్పేందుకు ప్రయత్నించగా.. ఎమ్మెల్యేగారూ మా సమస్యలు వినడం లేదా.. మా ఓట్లు మాత్రమే కావాలా అని మహిళలు మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిట్ట నాగేశ్, వైస్ ఎంపీపీ నాగప్ప, రఘు, ఫక్కీరప్ప, సోమశేఖర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచాని సోమప్ప స్కూల్ విద్యార్థుల ర్యాలీ

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్23: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన మాచాని సోమప్ప జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మంగళవారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలకు చెందిన 423మంది పరిక్షకు హాజరు కాగా 315మంది విద్యార్థినులు మంచి మార్కులతో 74శాతం మంది ఉత్తీర్ణత సాధించి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో టాపర్లుగా నిలిచారు. దీంతో విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండాలని హెచ్‌ఎం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు సులోచనమ్మ, వెంకటలక్ష్మి, దేవేంద్ర పాల్గొన్నారు.

సున్నావడ్డీ రుణాలు అంటూ సున్నంపెట్టాడు

● టీడీపీతోనే సంక్షేమం : బీవీ జయనాగేశ్వరరెడ్డి
● పట్టణంలోని చాకలివీధి, గంగన్నమసీదు ప్రాంతాల్లో బీవీ విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరు , ఏప్రిల్23: ఎన్నికలకు ముందు సున్నావడ్డీకి రుణాలు ఇస్తానంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక జగన్ ప్రజలకు సున్నంపెట్టాడని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని చాకలివీధి, గంగన్నమసీదు ప్రాంతాల్లో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు ఆర్టీసి అల్తాఫ్ ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించి ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం స్థానిక గంగన్నమసీదు ప్రాంతంలో మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో బీవీ మాట్లాడుతూ పట్టణానికి రూ.146 కోట్లతో జీడీపీ నుంచి తాగునీటి పైపులైన్ పథకం తెస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనతండ్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి హయాంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. వైసీపీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వచ్చాక యూజీడీ పథకం పేరుతో రోడ్లన్నీ తవ్వి గుంతల మయంగా మార్చారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు టిడ్కో గృహాలు ఇవ్వాలని బాబును ఒప్పించి 8వేల టిడ్కో గృహాలు మంజూరు చేయించామన్నారు. దాదాపు 5వేల గృహాలు పూర్తయ్యి ఐదేళ్లు గడుస్తున్నా నేటికి ఆ గృహాలు ఇవ్వకుండా జగన్ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లబ్ధిదారులందరికీ గృహాలు పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. తనను, ఎంపీ అభ్యర్థి కురువ నాగరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, నాయకులు మిఠాయి నరసింహులు, కొండయ్య చౌదరి, రంగస్వామిగౌడు, రామకృష్ణనాయుడు, కామార్తి మహేష్, భాస్కర్, వీరేష్, రంజాన్, గౌస్, నాగరాజు, పార్టీ పరిశీలకులు శ్రీరాములు, జనసేనా నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో ముఖాముఖి మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి

నందవరం మండలంలో విస్తృత ప్రచారం

నందవరం : మండలంలోని గురుజాల, రాయచోటి, మిట్టాసోమాపురం గ్రామాల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాకా బీసీలకు పెద్ద పీటవేసిందని గుర్తు చేశారు. అన్ని రకాలుగా రిజర్వేషన్లు కల్పించి దన్నారు. చంద్రన్న బీమాను రూ 10లక్షలకు పునరుద్ధరణ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి రైతుకు ఏటా రూ 20 వేలు సహాయం, ఇంటికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, యువతకు 3 వేలు నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమని, సీఎంగా చంద్రబాబు అవుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, కాశీంవలీ తదితరులు పాల్గొన్నారు.





నందవరంలో మాట్లాడుతున్న బీవీ, సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని యువతను కోరుతూ..

నాలుగు నామినేషన్‌ల దాఖలు

ఆలూరు, ఏప్రిల్ 23: ఆలూరు అసెంబ్లీ స్థానానికి వైసీపీ అభ్యర్థి విరుపాక్షి, ఆయన భార్య రామాంజనమ్మ సోమవారం ఆలూరులోని సాయిబాబ ఆలయం నుంచి ప్రదర్శనగా వెళ్లి మరో సెట్ నామినేషన్‌లను దాఖలు చేశారు. ఆయన వెంట కర్నూలు మేయర్ బీవై రామయ్య, టీడీపీ నాయకులు వైకుంఠం మల్లికార్జున, మాజీ ఎమ్మెల్యే మసాల పద్మజ ఉన్నారు. అలాగే బీఎస్పీ అభ్యర్థిగా రామలింగ, కాంగ్రెస్ పార్టీ నుంచి అరకట్ల నవీన్ కిషోర్ నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 9 మంది వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్‌లు సమర్పించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అదికారి రామునాయక్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

ఎమ్మిగనూరు/రూరల్, ఏప్రిల్23: ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కాశింవలి నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాంపుల్ల యాదవ్‌తో కలిసి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలతో తహసీల్దార్ కార్యాలయం గేటు వరకు ర్యాలీగా వచ్చారు. ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్యయాదవ్, సీపీఐ నాయకులు రంగన్న, సీపీఎం నాయకులు హనుమంతు, అడ్వకేట్ నారాయణ తో కలిసి ఆర్వో చిరంజీవికి కాశింవలి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే బీఎస్పీ అభ్యర్థిగా కప్పటి రాఘవేంద్ర తన రెండవ సెట్ నామినేషన్‌ను ఆర్వో చిరంజీవికి అందజేశారు. ఇప్పటివరకు ఎమ్మిగనూరు ఏయోజకవర్గానికి వివిధ పార్టీలకు చెందిన 15 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు ఆలూరు తాలుకా టీడీపీ సమావేశం

ఆలూరు, ఏప్రిల్ 23: స్థానిక ఉమా కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటలకు టీడీపీ నాయకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి వీరభద్ర గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జోన్-5 ఎన్నికల కో-ఆర్డినేటర్ బీద రవిచంద్ర యాదవ్, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, కర్నూలు పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త బీటీ నాయుడు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆలూరు తాలూకా జనసేన ఇన్‌చార్జి తెర్నేకల్ వెంకప్ప, బీజేపీ నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు, మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, బూతు ఇన్‌చార్జీలు, నందమూరి అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కౌతాళం, ఏప్రిల్ 23: ఉరుకుంద ఈరన్న స్వామి వారికి మంగళవారం ఓ భక్తుడు దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారికి దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి తెలంగాణ రాష్ట్రం అచ్చంపేట(నాగర్ కర్నూల్) వాస్తవ్యులు శ్రీకాంత్, అనూష దంపతులు రూ.లక్ష నగదును దేవాలయ కార్యాలయంలో అందజేశారని పేర్కొన్నారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టి స్వామి వారి శేషావస్త్రములను, ఫలపుష్పలను అందజేశారు.

ఒటు హక్కుతోనే బంగారు భవిష్యత్తు

● రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోండి
● ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు, సిబ్బంది

ఆదోని, ఏప్రిల్ 23: ఓటు హక్కు తోటే బంగారు భవిష్యత్తు సాధ్యమని సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి శివ్ నారాయణ్ శర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాతా శిశు హాస్పిటల్ నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు మున్సిపల్, సెక్టార్ల అధికారులు, బీఎల్‌వోలు, అంగన్వాడి, సచివాలయ సిబ్బందితో కలిసి కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్ నమోదు శాతాన్ని పెంచుకోవాలసిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ప్రజలందరూ పెద్ద స్థాయిలో బయటికి వచ్చి రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కుని, బాధ్యతని నిర్వహించాలన్నారు. మన బాధ్యతను మనం విస్మరించిన రోజున మన హక్కును అడగడం కూడా కోల్పోతామని స్పష్టం చేశారు. ఓటర్లు బాధ్యతగా బయటకు వచ్చే ఓటు వేయాలనే విషయాన్ని ప్రజలందరికీ చేరవేయాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హసీనా సుల్తానా, మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, మునిసిపల్ అస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌పీఓ పరిపాలన అధికారి వీరభద్రప్ప పాల్గొన్నారు.

నెలన్నరలో రాక్షస పాలన అంతం

● టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
● నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల విస్తృత పర్యటన
● సింగరాజనహల్లి, కుంటనహల్, డి.బెళగల్, దొడ్డి గ్రామాల్లో అభ్యర్థి సోదరుల ఇంటింటి ప్రచారం

పెద్దకడుబూరు, ఏప్రిల్ 23: నెలన్నర రోజుల్లో రాష్ట్రంలో రాక్షస పాలన అంతమై మంచి రోజులు రానున్నాయని టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం బసలదొడ్డి, పులికనుమ, చిన్నతుంబళం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పరిపాలనలో రాష్ట్ర భవిష్యత్తు 25 ఏళ్ల వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజల ఆశల పై నీళ్లు చల్లి స్వార్థమే పరమార్థంగా అసమర్థ అరాచక పరిపాలనను సాగించారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి దోచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. మీ బిడ్డకు ఎమ్మెల్యేగా ఒక్క ఛాన్స్ ఇవ్వాలని, మీకు సేవకుడిగా పని చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నతుంబళం టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, చంద్ర, శివలు గదను బహూకరించారు. టీడీపీ తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, ఎస్సీ సెల్ నాయకులు, ఏసుపు, విజయకుమార్ పాల్గొన్నారు.

మంత్రాలయం: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, నియోజకవర్గ కార్యదర్శి చంద్ర పార్టీశ్రేణులతో కలిసి సింగరాజనహల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎం గోపాల్ రెడ్డి నాయకులు ఈరన్న, గంగన్న, వీరేష్, హుశేనీ, జగన్నాథ్, గంగన్న పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

కౌతాళం మండలంలో జోరుగా ప్రచారం

కౌతాళం : మండలంలో టీడీపీ ప్రచారం ఊపందుకొంది. మంగళవారం కుంటనహల్ గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఉమ్మడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి తరపున సోదరుడు రామకృష్ణరెడ్డి టీడీపీ మండల నాయకుడు సురేష్‌నాయుడుతో కలిసి పార్టీ శ్రేణులు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు.

టీడీపీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి

కోసిగి : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. డి.బెళగల్, దొడ్డి గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి తరుపున ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రచారం నిర్వహిచారు. టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, చింతలగేని నర్సారెడ్డి, రామయ్య, సొట్టయ్య, మల్లారెడ్డి, రామాంజనేయులు, రఘు, రంగారెడ్డి, కోసిగయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





డి.బెళగల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, సింగరాజనహల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి సోదరుడు రఘునాథరెడ్డి

ఘనంగా ఫక్కీరప్పస్వామి రథోత్సవం

మద్దికెర, ఏప్రిల్ 23: ఎం.అగ్రహారం గ్రామ శివారులోని అవదూత ఫక్కీరప్పస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 3 నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో గ్రామ వీధులగుండా దేవాలయానికి తెచ్చారు. భక్తులు అరటిపండ్లతో రథంపై విసిరి భక్తిని చాటుకున్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కడిమెట్ల గ్రామంలో చెన్నకేశవస్వామి మహారథోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా ఊరేగించారు. ప్రతి యేటా అంపయ్యపున్నమిని పురస్కరించుకొని స్వామికి గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఊరేగించారు.

గోనెగండ్ల : ఎర్రబాడు గ్రామంలో చెన్నకేశవస్వామి జాతర రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు స్వామి రథోత్సవం సాగింది.

కరివీర భద్రస్వామి రథోత్సవం

మంత్రాలయం: కల్లుదేవకుంట గ్రామంలో వెలసిన కరివీర భద్రస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆలయ ధర్మకర్తలు రాఘవరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథరెడ్డి, విఖ్యాతరెడ్డి, వైస్ ఎంపీపీ సింధూ ప్రియ, సర్పంచు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచు జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని మహారథంపై ఉంచి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

తుగ్గలి : మండలంలో ఆంజనేయస్వామి రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని అమీనాబాదులో హనుమాన్ జయంతి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు.



భక్తుల మధ్య ఫక్కీరప్పస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఎర్రబాడులో చెన్నకేశవస్వామి రథోత్సవం సాగుతున్న దృశ్యం